గోడ గడియారం టిక్ టిక్‌మంటూ తన పని అది ఠంచనుగా క్రమ బద్ధంగా చేసుకు పోతూంది.

టైం అయిదు కాగానే ఎలాంటి బద్ధకం, నీరసం, విసుగూ లేకుండా ఠంగ్ ఠంగ్ మంటూ గంటలు కొట్ట సాగింది...

అయిదో గంట మ్రోగుతుండగా, రాజశేఖరంకు ఎవరో తట్టి లేపినట్లు అలవాటు ప్రకారం టక్కున మెలకువ వచ్చింది.

తన చేతి వాచీ తీసి చూశాడు. అది కూడా అయిదే చూపిస్తోంది. ఇది నైన్‌టీన్ ఫార్టీస్ నాటి వోల్డు వాచీ! దీన్ని కూడా మిల్ట్రీ డిసి ప్లేయిన్‌లో పెట్టాడాయన.

దానికి కీ యిచ్చి యధాస్థానంలో పెట్టేశాడు.

అలమర పక్కన గోడకు ఏదో నశ్యం కంపెనీ వారి డేటు క్యాలండరు వుంది. దాని పై కాగితాన్ని చింపేశాడు.

# అరిగే రామారావు



గబుక్కున మంచం మీద లేచి కూర్చున్నాడు.

ఆ గడియారం అయిదో గంట కొట్టుతుండగా, ఆయన రోజూ ఠంచనగా నిద్ర లేచి కూర్చుంటాడు. ఇది గత పాతిక ముప్పై ఏళ్లగా వస్తోన్న ఆయన అలవాటు!

విధి నిర్వహణలో నైన్‌టీన్ థర్టీస్ నాటి ఆ పాత గోడ గడియారానికీ ఆయనకూ చాలా పోలికలున్నాయి. ఆవులిస్తూ లేచి అలమారలో ఉన్న క్రొత్త కాగితం క్రొత్త తేదీని చూపిస్తోంది.

జూలై 31వ తేది.

ఆ తేదీని చూడగానే ఆయనకేదో చటుక్కున గుర్తుకొచ్చింది. ఆయన హృదయం ఆనందంతో ఎగిరి గంతేసింది.

1982 జూలై 31,

అది తన రిటైర్‌మెంట్ డేటు.


అంటే తనివ్వాళ రిటైరు కాబోతున్నాడన్న మాట! తన ముప్పై

మూడేళ్ళ గవర్నమెంటు సర్వీసులో తనకిది ఆఖరు రోజు! సాయంత్రం అయిదు గంటల్నుంచి తను రిటైరయి పోతాడు.

ఓహో, తనకి చాలా ఆనందంగా వుంది!

ఈ ఒక్క రోజు ఆఫీసుకు వెళ్లితే చాలు. ఇహ రేపట్నుంచి తను ఆఫీసుకెళ్ళనక్కర్లేదు!

రేపట్నుంచి తనకు బోలెడు ఖాళీ-



నిలయం
శ్రీకాకుళం

విశ్రాంతే విశ్రాంతి! మిగిలిన జీవిత మంతా విశ్రాంతి!

వెరీ లవ్‌లీ! హాయి, హాయి!

ఆయనకు చిన్నగా ఈల వేసి, సన్నగా ఒక కూనిరాగం తీయా లన్నంత ఆనందంగా వుంది. తన అర్ధాంగి చెంపన ఒక చిటిక వెయ్యా లన్నంత సరదాగా వుంది!

ప్రక్కకు తిరిగి చూశాడు.

ఆయన అర్ధాంగి కామాక్షమ్మ ప్రక్క మంచం మీద తల క్రింద చెయ్యి పెట్టుకొని ప్రశాంతంగా నిద్రపోతూంది.

'మై డియర్ వోల్డు బ్యూటీ!' అని ముచ్చట పడ్డాడాయన.

ఈ వోల్డు బ్యూటీ ఆరు దాటితే గాని ఆవులించి నిద్ర లేవదు.

కొడుకూ, కోడలూ పడుకున్న గది లోంచి చిన్న మనమరాలు రేఖ ఏడ్పు వినిపిస్తోంది.

కోడలు కాత్యాయని మగత నిద్రతో విసుగ్గా, ''దెయ్యం ముండకు అప్పుడే తెల్లారింది. పడుకో! ఏడ్చా వంటే చంపుతా!'' అంటూ కూతు రును గదమాయిస్తోంది.

కూతురుకు నాలుగేళ్ళు నిండలేదు. మళ్ళీ తను చూలింతరాలు. ఆ మాత్రం విసుగూ, కోపం వుండ డం సహజమే మరి!

ఆయన చిన్నగా నవ్వుకున్నాడు.

అలవాటుగా బాయిలర్ బయట పెట్టి, పంపులో నీళ్ళు పట్టి పోసి దాన్ని వెలిగించాడు.

మామూలు కాలకృత్యాలు తీర్చుకొని హేండ్ స్టిక్ తీసికొని మార్నింగ్ వాక్‌కు తయారయ్యాడు.

వరండాలో విడిచిన చెప్పులు తొడు క్కుంటూంటే, మూల మునగ దీసికొని పడుకున్న 'జూలి' కుయ్ కుయ్‌మంటూ ఆయన కాళ్ళను చుట్టేసుకుంది.

దాని మెడకు కట్టిన గొలుసు విప్పాడు.

స్వేచ్ఛ దొరికిన ఆనందంతో అది హుషారుగా బయటికి పరుగెత్తింది.

'ఈ సాయంత్రం నుంచి మాకూ గొలుసు విప్పేస్తారే! నాకూ నీకు లాగే బోలెడంత స్వేచ్ఛ!' అను కుంటూ బయటికి వచ్చాడు.

'ఇంకెంత సేపే పిచ్చి ముండ ల్లారా! ఈ కాసేపూ కళ్లు మూసు కుంటే లేయెండలొచ్చి మీ చెర తొలగిస్తాయి!' పూలమొక్కలను చూసిఅనుకుంటూబయటికి వెళ్ళాడు.

రాజశేఖరం బర్కత్ పూరా వయిపు నడుస్తోన్నాడు. రోజూకంటే ఇవ్వాళ అడుగులు మరీ వుషారుగా పడు తున్నాయి.

బర్కత్‌పురా చమన్ దాటుతూ

వుంటే ఎవరో తనని పేరు పెట్టి పిలుస్తున్నట్లనిపించింది.
ఆగి వెనక్కి తిరిగి చూశాడు.
జయరాం! తన మార్నింగ్ వాక్ జతగాడు.
జయరాం, "ఏఁవయ్యా రాజశేఖరం! ఇవ్వాళ నన్ను పిలవకుండానే వెళ్ళి పోతున్నావు?" అన్నాడు.
రోజూ తను వాళ్ళింటి ముందు ఆగి పిల్చేవాడు. ఇవ్వాళ తన ఆనందంలో ఈ సంగతే మర్చిపోయాడు.
ఇద్దరూ ఫీవరాసుపత్రి వయిపు నడుస్తోన్నారు.
రాజశేఖరం తనని ఇవ్వాళ ఇంత గుడ్ మూడ్సులో వుంచిన గుడ్ న్యూస్‌ను తన స్నేహితుని దగ్గర మెల్లగా 'బ్రేక్' చేశాడు.
"యు ఆర్ ఎ లక్కీ మేన్!" అంటూ అతను తనని అభినందిస్తోంటే తను గర్వంగా రొమ్ము విరుచుకున్నాడు.
"ఇంకా నాకు మూడేళ్ళుద్చింది!" జయరాం బిక్కమొగం వేసుకొని దిగులుగా అన్నాడు.
"నీ పని అంతే కావాలి!" అని కొంటెగా అనుకొని నవ్వుకున్నాడు.
"మరి నీ రిటైర్డు లైఫ్ ఎలా గడుపుతావు?" జయరాం అడిగేడు.
"ఏం వుంది? ఒక నెల రోజుల పాటు పగలంతా కరువు తీరా నిద్రపోతా. సాయంత్రాలు, మా మనవడు, మనమరాలితో సరదాగా ఆడుకుంటాను. ఈ ఆఫీసు బాదరబందిలో పడి ఇన్నాళ్ళుగా ఆధ్యాత్మికంగా వెనుక బడిపోయాను. ఆ లోటు భరీదేయటానికి, రోజూ శంకర మఠంలో పురాణ కాలక్షేపాలకు హాజరవుతాను. వీలు వెంబడి దేశంలోని పుణ్య క్షేత్రాలన్నీ సందర్శిస్తాను. రోజూ రెండు మూడు గంటలు భగవద్గీతా, సుందరకాండా, పారాయణం చేస్తాను..." యిలా తన మనసులోని కోర్కెలన్నింటినీ స్నేహితుని దగ్గర ఏకరవు పెట్టాడు.
మళ్ళీ తిరిగి యింటికి వచ్చేసరికి యింట్లో వాళ్ళంతా నిద్రలేచారు. వాళ్ళ వాళ్ళ పనుల్లో వాళ్ళున్నారు. భార్య యిచ్చిన కాఫీ త్రాగుతూ, షేవింగ్ సెట్ ముందేసుకుని కూర్చున్నాడు.
గడ్డం చేసుకుంటూంటే మనమడు

---

## పరధ్యానం

"ఏమిటోయ్ గుర్నాధం బాగున్నావా? పిల్లలెందరు?"
"నేనింకా బ్రహ్మచారినే కదరా?"
"అవునుకదూ! అన్నట్టు నీ భార్య కూడా ఇంకా పెళ్ళి చేసుకోలేదు కదూ?"

—కుల్‌సుమ్‌బీ.

---

రవి తన కాన్వెంటు పుస్తకాలు తెచ్చుకొని, "తాతా! నాకు ఇంగ్లీషు లెసన్ చెప్పవా?" అని అడిగేడు.

"ఇప్పుడు టైం లేదురా అబ్బీ! రేపట్నుంచి మనం యింట్లోనే వుంటాంగా! నీక్కావలసిన పాఠాలన్నీ ఎంచక్కా చెబుతారా బాబూ!" అన్నాడు.

"రేపట్నుంచి నీవు ఆఫీసుకెళ్ళవా తాతా?" మనమడు తన సందేహాన్ని వెలిబుచ్చాడు.

"లేదురా అబ్బీ! టు డే ఐ యాం గోయింగ్ టు రిటైర్ ఫ్రం సర్వీస్!" గొప్పగా చెప్పాడు.

ఇంతలో అటు వయిపు నుంచి వెళ్లుతున్న కోడలు కాత్యాయని ఈ మాట విన్నది.

ఆశ్చర్యంగా- "ఏంవిటి మామయ్యగారూ! మీరు రిటైరయ్యేది ఇవాళ నుంచేనా?" అంది.

"అవునమ్మా! ఇవ్వాళతో ఈ ఆఫీసు పీడ విరగడై పోతుంది!" సంతోషంగా అన్నాడు.

ఆమె లోపలికెళ్ళి ఈ విషయం భర్తకు చెప్పింది.

కొడుకు మూర్తి వచ్చి, "మీ కోడలు చెప్పింది నిజమేనా నాన్నగారూ?" అన్నాడు.

"అవున్రా!" అని హుషారుగా తల వూగించాడు.

మూర్తి ఏదో ఆలోచిస్తూ మౌనంగా లోపలికెళ్లిపోయాడు.

ఆ వెంటనే ఆయన భార్య కామాక్షమ్మ వచ్చింది.

ఆమె నోరు తెరచి అడిగే లోపలే "యస్ యస్ కాముడూ!" అని జాలీగా అన్నాడు.

చిన్న కుర్రాడిలాగా కులుకుతున్న భర్త వంక కామాక్షమ్మ నోరెళ్ళబెట్టుకొని చూచింది.

స్నానం చేసి ప్యాంటు లోపల షర్టు టక్ చేసుకుంటూ, 'ఈ డప్పూ, డవాళూ ఈ వెధవాఫీసు వేషం రేపట్నుంచి వెయ్యక్కర్లేదు!' ఏ పని చేస్తోన్నా ఆయనకిదే భావన!

ఆఫీసు అటెండెన్సు రిజిష్టరులో ఆఖరి సంతకం పెట్టుతున్నప్పుడు ఒక విధమైన ఎక్సైట్‌మెంటూ, దాన్తోపాటు కించిత్తు బాధ కూడా కలిగాయి.

ఆ సాయంత్రం ఆఫీసు స్టాఫ్ రాజశేఖరంకు పార్టీ యిచ్చారు.

ఎకౌంట్స్ ఆఫీసరుగా- ఆయన చూపిన కార్య దక్షతనూ, నిజాయితీని కొనియాడారు. పూల దండ వేశారు. నగిషీ చెక్కిన నల్ల చేవ చేతి కర్ర- భగవద్గీతా కానుకగా యిచ్చారు.

ఆయనకు రావల్సిన ప్రావిడెంట్ ఫండూ, గ్రాట్యూటీ తాలూకు

పైకము దాదాపు అరవై అయిదు వేల రూపాయిల చెక్ ఇచ్చారు.

కార్లో ఆయన్ని యింటి వద్ద దిగ పెట్టారు.

ఆ రాత్రి రాజశేఖరం హాయిగా, తృప్తిగా గాఢ నిద్రపోయాడు.

అంత ప్రశాంతమైన గాఢనిద్ర గత కొన్ని సంవత్సరాలుగా ఆయన ఎరగడు.

పాపం, ఆయనంత ప్రశాంతంగా నిశ్చింతగా నిద్ర పోయిందీ, పోగలిగిందీ ఆ ఒక్క రాత్రి మాత్రమే! ఆ తర్వాత వచ్చిన రాత్రుల్లో ఏ ఒక్క రాత్రి కూడా ఆయన, పాపం ప్రశాంతంగా నిద్ర పోలేదు. ప్రశాంతంగానే కాదు- వికలమైన ఆయన మనస్సు ఆయనకు మామూలు నిద్ర కూడా దూరం చేసింది.

ఆయన మనస్సును అంత వికలం చేసిన సంఘటన ఒకటి ఆయన మీద దెబ్బ తీయటానికి మర్నాటికి మాటేసుకొని కూర్చుంది!

ఇలా కూడా జరుగుతుందేమోనని తను కలలో కూడ వూహించలేదు.

రిటైరయిన మర్నాడు వుదయం ఆయన కాఫీ త్రాగుతూ 'హిందూ' పేపరు పేజీలు త్రిప్పుతున్నాడు.

ఇంతలో కొడుకు మెల్లగా ఆయన దగ్గరికి వచ్చాడు.

---

### వారసత్వం

ఆయన: పంతులు గారూ, మా మా అబ్బాయి లెక్కల్లో ఎలా ఉన్నాడు. నేను చదువుకొంటున్నప్పుడు నేను లెక్కల్లో చాలా వెనుకపడి ఉండేవాడిని.

మాస్టారు: అబ్బే, మీ అబ్బాయికేమండీ! కాకపోతే చరిత్ర పునరావృత్తమవుతోంది.

—కుల్‌సుమ్‌బీ.

---

"నాన్నగారూ! మా ఫ్రెండు సుదర్శనం మీకు తెల్సు కదూ?" అని మెల్లగా స్టార్టు చేశాడు.

"తెలియకేం బాబూ! ఆబిడ్స్‌లో ఇన్‌కం టాక్స్ ప్రాక్టీస్ పెట్టాడు కదూ? అతని ప్రాక్టీస్ బాగా సాగుతోందా?" అని అడిగేడాయన.

"ప్రాక్టీసుకేం బ్రహ్మాండంగావుంది! వాడు నిన్న సాయంత్రం కలిశాడు. వాడి ఆఫీసులో ఎకౌంట్సు చూట్టానికి నమ్మకమైన మనిషి కోసం చూస్తోన్నాడంట! మీరు రిటైరయిన సంగతి చెప్పా. ఎగిరి గంతేశాడు. ఎవరికైనా ఐతే నెలకయిదు వందలిద్దాం అనుకుంటున్నాను, మీ నాన్నగారికయితే ఆరొందలిస్తాను అన్నాడు" అని వుషారుగా పెద్ద నిర్వాకం చేసిన వాడిలాగా చెప్పుతున్నాడు.

కొడుకు చెప్పుతున్న సమాచారం వింటూంటే ఆయన చేతిలోని పేపరు జారి క్రింద పడింది. ఆయన మొహం కళావిహీనమైపోయింది.

"ఏం నాన్నగ్గారూ! ఏం చెప్పమంటారు? రేపట్నుంచి ఆఫీసు కొస్తారని వాడికి ఫోన్ చేసి చెప్పనా?" అన్నాడు ఆశగా.

"నిన్న రిటైరయ్యాను. రేపట్నుంచి మళ్ళీ వుద్యోగం చెయ్యమంటావా బాబూ?" బాధగా అన్నాడాయన.

"చేస్తే తప్పేముంది నాన్నగారూ? ఆఫీసు పనేగా! అందులో మీకు తెలిసిన ఎకౌంట్సేగా?"

"చేస్తే తప్పనీకాదు; నాకు ఎకౌంట్స్ తెలియకనీ కాదు! బట్ ఐ వాంట్ కంప్లీట్ రెస్ట్!" భారంగా కుర్చీలోకి వాలుతూ అన్నాడు.

"రిటైరయిన వెంటనే రెండొందలు, మూడొందలు జీతాలకు జనం ఎగబడుతున్నారు. లక్షణంగా నెలకు ఆరొందలు జీతం వస్తుంది!" తండ్రికి నచ్చచెప్పాలని తాపత్రయపడ్డాడు.

"నే నిహ ఎలాటి వుద్యోగాలూ సద్యోగాలూ చెయ్యలేనురా బాబూ! ఐ నీడ్ ఫుల్ రెస్ట్!" జాలిగా, దైన్యంగా అన్నాడు రాజశేఖరం.

"అయితే జాబ్ చెయ్యనంటారా?" మళ్ళీ రెట్టించి అడిగేడు.

నీళ్లు నమలకుండా, మాటలు మ్రింగకుండా సూటిగా - "నేను చెయ్యనురా, బాబూ!" అని గట్టిగా చెప్పేశాడు.

"ఆలోచించండి!" అని కొడుకు కోపంగా విసురుగా వెళ్లిపోయాడు.

రాజశేఖరం బరువుగా కళ్లు మూసుకున్నాడు.

లోపల్నుంచి కొడుకు కోపంగా అరుస్తోన్న అరుపులు విని పిస్తోన్నాయి. వూరికే కోడలు మీదా, పిల్లల మీదా అరుస్తోన్నాడు. తల్లి ఏదో అనబోతే ఆమె మీద కస్సున లేచాడు.

పడక కుర్చీలో పడుకుని కొడుకు అరుపులు వింటూ నిస్సహాయంగా నిట్టూర్చాడాయన.

కొడుకు అలా అరుస్తూ, చిందులు త్రొక్కుతూ ఆఫీసుకి వెళ్లిపోయాక కోడలు ఎందుకో ఆ గది లోకి వచ్చి వెళ్ళింది. వెళ్లుతూ వెళ్లుతూ తనవంక తిరస్కారంగా చూచింది.

తర్వాత భార్య వచ్చింది.

"ఇంకా అలా పడుకున్నారే? స్నానం చెయ్యరా?" అంది.


తను మాట్లాడలేదు.

"అబ్బాయి మీ కోసం వుద్యోగం చూస్తే చెయ్యనన్నారంటగా! వాడు వూరికే మండిపడి పోతున్నాడు! నెలకు ఆరొందలు జీతమంట. వుద్యోగం చెయ్యటానికేం?" నిష్ఠూరంగా అంది.

ముప్పై మూడేళ్లు సర్వీసుచేసి, ఎకౌంట్సు ఆఫీసరుగా రిటైరయ్యాక వచ్చినా మళ్లీ తను వుద్యోగం చెయ్యనని గట్టిగా అన్నాడు.

ఇకారోజునుంచీ యింట్లో పోరు ఎక్కువయిపోయింది. కోడలు సూటీ పోటీ మాటలు ఎక్కువయిపోయాయి. కొడుకు తనతో మాట్లాడటం మానేశాడు.

భార్యకూడా వాళ్లతో కలిసిపోయింది.




మళ్లీ ఇలాటి చిల్లర వుద్యోగాలు చెయ్యటం తనకిష్టం లేదన్నాడు తను.!


"నెలకు ఆరొందల జీతం చిల్లర వుద్యోగం అవుతుందా?" భార్య రొక్కించింది.

ఆ మాటమీద తమ యిద్దరికి వాగ్వాదం జరిగింది. ఎన్ని వందలు ఇటొచ్చీ అటొచ్చీ ఒకమాట అంటుంది; వుద్యోగం చెయ్యమని వత్తిడి చేస్తుంది; తనని వప్పించటానికి రకరకాల ఆర్గుమెంట్సు మొదలుపెట్టుతుంది.

"వాడు మాత్రం ఇంత సంసారాన్ని ఒక్కడూ ఈదుకు రావద్దూ? మీకు నెలనెలా ఫించను కూడా ఇవ్వ

రంటగా?'' అంటుంది.

"ఇవ్వకపోతే నేం? అంతా ఒక్కసారే ముట్టచెప్పారుగా? ఆఫీసు వాళ్లిచ్చిన చెక్కూ వాడికే యిచ్చాగా. అదీగాక బ్యాంకులో నా ఎకౌంటులో పదిహేనువేలు దాకా వున్నాయి. మొత్తం దాదాపు లక్ష రూపాయలు అంతా వాడికేగా?'' అంటాడు తను.




"వుంటే మాత్రం? కూర్చొని తింటే కొండలయినా తరిగిపోతాయి అంటారు! వాడు ఈ డబ్బుతో పైన పోర్షను వేసి అద్దెకిస్తానంటున్నాడు.''

"అందుకోసం మళ్లీ నన్ను వుద్యోగం చెయ్యమంటాడా? ముప్పై మూడేళ్లు గాడిద చాకిరీ చేశా! ఇంకా చేసి సంపాదించి వాడికివ్వాలా? పైన పోర్షను వెయ్యాలంటే వాడు సంపాదించిన డబ్బేదన్నా వుంటే దాన్తో వెయ్యమను!'' కోపంగా అంటాడు తను.

ఇంకో క్రొత్త అస్త్రం తీస్తుంది భార్య.

"మనకు వీడు కాక ఇద్దరు అమ్మాయిలున్నారుగా! ఆడపిల్లలకు వాళ్ల సొంతానికెంత వున్నా పుట్టింటి మీద ఆశ వుంటుంది. వాళ్లకు సారె అని చీరె అనీ, పురుళ్లనీ పున్నెలనీ వాళ్ల మంచీ చెడ్డా చూడాలిగా? ప్రతిదానికీ అబ్బాయిని ఏం అడుగుతాం చెప్పండి? మీదంటూ మీకు వేరే సంపాదనవుంటే ఆడ

## పాతకేసు

డాక్టరుగార్కి ఫోనుకాల్.

"మీరర్జంటుగా రావాలి.... మావాడు పైసను మింగేసాడు."

"ఏ పైస?"

"పదిహేడో శతాబ్దంది."

"ఏంటండీ! మీరు మూడు వందల సంవత్సరాల క్రిందటి కేసు గురించి చెబ్తున్నారు" అంటూ ఫోన్ పెట్టేశారు డాక్టర్ గారు.

—గుండాన జోగారావ్.

పిల్లల అచ్చటా ముచ్చటా చూడొచ్చు!" అంటుంది.

"ఈ ముప్పైమూడేళ్లుగా సంపాదించిందంతా పోయిందా? నిన్నటికీ ఇవ్వాల్టికీ అప్పుడే నన్ను సంపాదన లేనివాడిక్రింద జమకట్టేశావా కామాక్షీ?" బాధగా అంటాడు తను.

భార్యకూడా ఇలా మాట్లాడటం ఆయనకెంతో మనఃక్షోభాన్ని కలిగించింది.

స్వార్థంతో కొడుకూ కోడలూ మాట్లాడారంటే అర్థం వుంది! తనతో ముప్పై అయిదేళ్లపైగా కాపురంచేసి అర్ధాంగిగా ఇన్నేళ్లుగా తనతో కష్టం సుఖం పంచుకున్న భార్యయేనా ఇలా మాట్లాడేది? ఇన్నేళ్లుగా ఉద్యోగ బాధ్యతలు మోసి మోసీ, రెక్కలు ముక్కలు చేసుకొని శారీరకంగా మానసికంగా అలసిపోయాడు. రిటైరయ్యాకన్నా విశ్రాంతిగా ప్రశాంతంగా మిగిలిన జీవితాన్ని కృష్ణా రామా అనుకుంటూ ఆధ్యాత్మిక చింతనలో వెళ్లమార్చాలనే తన తపనను ఎంత చెప్పినా ఈ మనిషి అర్థం చేసుకోలేదేమిటి? ఈ వయస్సులో మళ్లీ తనని ఉద్యోగం ఉచ్చులో బిగించాలని చూచే కొడుకు, కోడలికీ చెప్పాల్సింది పోయి వాళ్లతోపాటు తనను వూరికే సాధిస్తోంది.

అర్ధాంగి ధోరణికి పాపం ఆయన ముసలిప్రాణం చివుక్కుమంది.

పోని కొడుకు సంసారం ఆర్థికంగా వడుదుడుకుల్లో వుంది, నీవు సాయం చేయకపోతే ఎట్లా-అంటే అనుకోవచ్చు. లక్ష రూపాయిల మూట కొడుకు చేతుల్లో పెట్టాడు! ఇంకా సంపాదించు- సంపాదించు అంటే ఎక్కడ చస్తాడు తను!

తన మనస్సు వేగిరపడే ఆధ్యాత్మిక చింతనలో గడపాలని గుళ్ళూ గోపురాల చుట్టూ తిరగసాగాడు.

ఆరోజు కాచిగూడా స్టేషను కెదురుగా వున్న ఆంజనేయస్వామి గుడికెళ్ళాడు.

ఇంటికి తిరిగి వచ్చేసరికి దిగులు పేరుకున్న మనస్సులాగా ఆకాశానికి

చీకటి కప్పేసింది. చుక్కలు పొడిచీ పొడవకుండా పొడిచాయి!
వరండాలో చెప్పులు విప్పుతూంటే లోపల్నుంచి కోడలు మాటలు విని పిస్తోన్నాయి.
ఎవరో గెష్టులు వచ్చారల్లేవుంది.
"....అనారోగ్యం ఏవీఁ లేదండి పిన్నిగారూ! మనకన్నా ఇంకెప్పు డన్నా రోగం నొప్పి వస్తుందేమో గాని మా మాఁవయ్య గారికెప్పుడూ జొరంకూడ రాదు. మనిషి ఆరో గ్యంగా దుక్కలాగా వుంటారు!"
"మరింకేఁవమ్మా?" అంది ఆ వచ్చి నావిడెవరో.
"తీపరం! పిలిచి నెలకు ఆరొంద లిస్తామంటే చేదు!"
కన్నకూతురులాగా చూచుకుంటున్న కోడలు అనేమాటలేనా ఇవి! డబ్బు ఇంత పాపిష్టిదా?
ఆయన నిట్టూర్చి భారంగా అడుగు లేసుకుంటూ బయటికి వచ్చేశాడు. కాంపౌండు లోపల మెల్లిగా పచార్లు చేస్తూ ఆలోచిస్తున్నాడు.
వీళ్ళ కంటికి తను దుక్కలాగా కని పిస్తున్నాడా? ఇలాటి మనుషులు నిజంగానే తనకు ఏ రోగమో నొప్పో వస్తే తనని చూస్తారా? తనకి చేస్తారా? దొడ్లో షెడ్లోకి ఈడుస్తారు గాని....
కాంపౌండు లోపలి పచ్చగన్నేర్లు ఆశపోతులాటి చీకట్లు చాచిన చేతుల క్రింద నలిగిపోతున్నాయి. ఉదయం మంచుతెర చెర. మధ్యాహ్నం మండుటెండ చెర. రాత్రుళ్ళు చీకట్ల చెర. ఇంక ఈ పూలకెప్పుడు విముక్తి?
వారం తిరక్కుండా కూతుళ్ళు ఇద్దరి దగ్గర్నుంచి వుత్తరాలు వచ్చాయి. ఆ వుత్తరాలు వేరు వేరుగా ఒకటి బెజవాడనుంచి మరొకటి వైజాగ్ నుంచి వచ్చినా, వాటిల్లోని విషయం మాత్రం కూడబలుక్కొని రాసినట్లు ఒకటిగానే ఉంది! డబ్బాశ అందర్నీ ఒకే విధంగా, ఒకే పంథాలో ఆలో చింప చేస్తుందేమో కర్మ!
వాళ్ళు రాసింది—అన్నయ్య మీ కోసం వుద్యోగం చూపిస్తే చెయ్య న్నారంట! మీకు డబ్బెంత చేదైతే ఆ జీతం డబ్బులతో ఆడపిల్లలమైన మాకు ఏఁవన్నా వస్తువులు కొని పెట్టండి. మాకు గ్యాసు పొయ్యి లేదని ఒకకూతురు వ్రాస్తే, మాకు మిక్సీలేక చాల బాధలు పడుతున్నా మనీ ఇంకో కూతురు రాసింది. అంతే తేడా!

---

**ప్రైవేట్ సెక్రట్రీ**

"సార్....మీ భార్యగారు మీతో కొన్ని ప్రయివేట్ విషయాలు మాట్లాడాలను కుంటున్నారు" చెప్పాడు ప్రయివేట్ సెక్రట్రీ.
"నోట్ చేసుకో...తర్వాత నాకు చెబుదువుగాని" అన్నాడు బాస్.

— గుండాన జోగారావు.

ఆ వుత్తరాలు చదువుకొని రాజ శేఖరం- "ఇలా వుంటాయి పిల్లల ప్రేమలు!" అనుకొని గాఢంగా నిట్టూర్చాడు.

రాను రాను ఆ ఇంట్లో తన పరిస్థితి దుర్భరంగా తయారయిపోతూంది. అందరూ తననొక శత్రువుని చూచి నట్లు చూస్తున్నారు. ఎవరూ తనతో మనస్సువిప్పి ఆప్యాయంగా మాట్లా డటంలేదు. తప్పీదారీ మాట్లాడినా ఆ మాటల్లో ఇదివరకటి ఆత్మీయతా అనుబంధమూ వుండటంలేదు.

ఆఖరికి పిల్లేధవ రవిగాడికి కూడ తనింట్లో వూరికే వుండటం బాధగా వుంది కాబోలు! "ఏంటితాత, నీవు ఆఫీసుకుపోవా? ఎప్పుడూ ఇంట్లోనే కూర్చుంటావు? ఆఫీసుకు ఫో!" అని అంటున్నాడు.

చివరికి ఆ కుక్కముండ 'జూలీ' కూడ తనవంక గుర్రుగా చూస్తున్న ట్లనిపిస్తోంది!

వీళ్ళందరి దృష్టిలో తనొక సోమరి పోతులాగా కనిపిస్తున్నాడు. అంతే గాని తన మనస్సేమిటో, ఆ మన స్సులోని బాధఏమిటో తన భార్యతో సహా ఎవరూ అర్థం చేసుకోవటం లేదు!

వీళ్ళందర్నీ కాదని ఇంట్లో కూర్చొని వీళ్ళ తిరస్కారాలనుపొందేకంటె, ఈ మనఃక్షోభానికి వెద చెందేకంటే ఆ పుద్యోగమేదో చేద్దామనే విరక్తి భావంకూడా కలిగింది ఒక స్థితిలో. ఇలా వుండగా ఒక సంఘటన జరి గింది.

రాజశేఖరం రోజూ వెళ్ళినట్లే గీతో పన్యాసం వింటానికి ఆ సాయింత్రం శంకరమఠానికెళ్ళాడు.

మళ్ళీ యింటికి తిర్గిరాలేదు.

సాయింత్రం రాత్రయింది. రాత్రి అర్ధరాత్రి అయింది. అర్ధరాత్రి వేకువఝాము అయింది. వేకువ ఝాం వుదయం అయింది. ఏది ఏదయినా రాజశేఖరం యింటికి తిర్గి రాలేదు.

ఆరోజు గడిచింది. ఆ మర్నాడు గడి చింది. ఇంకో మర్నాడు కూడ గడి చింది. అయినా ఆయన తిర్గిరాలేదు. ఆయన జాడ తెలియలేదు.

కామాక్షమ్మ ఏడుస్తూ కూర్చుంది. కోడలు బెంబేలు పడిపోయింది. కొడుకు కాలుగాలిన పిల్లిలాగా తండ్రి కోసం వూరంతా తిరిగేడు. ఎవరెవరికో ఫోన్లు చేశాడు. తెలిసిన వాళ్ళనూ తెలియని వాళ్ళనూ అడి గేడు. అయినా తండ్రి ఆచూకీ తెలియలేదు.

చెల్లెళ్ళ దగ్గరికి వెళ్ళేడేమోనని బెజ వాడా వైజాగ్ ఫోన్లుచేసి కనుక్కు న్నాడు.

రైలు పట్టాల దగ్గరా, హుస్సేను

సాగర్ దగ్గరా శవం ఏదైనా దొరుకు తుందేమోనని చూశాడు. చివరికి పోలీసు రిపోర్టుకూడ యిచ్చాడు.

దిన పత్రికలో ప్రకటన యిద్దామని పత్రికాఫీసుకెళుతుంటే దారిలో తెలిసి నాయన కనిపించాడు. "మీ నాన్న గార్ని శాంతి ఆశ్రమంలో ఎవరో చూశారంట" అని వార్త చెప్పాడు.

శాంతి ఆశ్రమం హైదరాబాదుకు 16 కి.మీ. దూరంలో విజయవాడ కెళ్ళే దారిలో వుంది.

మూర్తి స్నేహితుల కారు అడిగి తీసికొని తల్లినీ, భార్యా పిల్లలను తీసుకొని శాంతి ఆశ్రమానికి బయలు దేరాడు.

వీళ్ళ కారు అక్కడికి చేరుకునేసరికి సాయంత్రం నాల్గు గంటలు దాటింది. సాయంకాలపు ఎండ ఎర్రగా కషాయి బట్ట ఆకాశంలో ఆరేసి నట్లుగా వుంది; కరుగ్గా చురుగ్గా వుంది. ఆశ్రమం ప్రక్కనే వున్న చిన్న కొండ-ఆశ్రమం మీద ఎండ పడకుండా గొడుగు పడుతున్నట్లుగా వుంది. అంతకు ముందే హడా వుడిగా కురిసి వెలిసిన వానవల్ల ఆశ్రమం కడిగిన ముత్యంలాగా వుంది.

చుట్టూతా వున్న పచ్చటి చెట్ల గుబు రులతో, పూలమొక్కలతో మధ్యగా వున్న పర్ణశాల- చిగురాకు పొత్తి ళ్ళల్లో హాయిగా ప్రశాంతంగా నిద్ర పోతున్న చిన్నారి పాపాయిలాగా వుంది.

మూర్తి ఆదుర్దాగా తండ్రిని గురించి వాకబు చేశాడు.

"క్రొత్తగా వచ్చినాయనా? నాతో రండి చూపిస్తా!" అని ఒక వ్యక్తి వాళ్ళను తన కూడా తీసికెళ్ళాడు.

ఆశ్రమం వెనుక భాగాన ఒక పెద్ద గున్నమామిడి చెట్టు వుంది. గుబు రుగా పెరిగిన ఆ చెట్టు- జీవితం మీద విరక్తితో బవిరి గడ్డం పెంచు కొని పద్మాసనం వేసుకొని కూర్చున్న సన్యాసి లాగా వుంది.

ఆ చెట్టు చుట్టూ ఒక రాతి తిన్నె కట్టబడి వుంది. సన్యసించినా వద లని సంసార లంపడం లాగా ఆ రాతి తిన్నె మీద రాజశేఖరం ధ్యాన ముద్రలో కూర్చొని వున్నాడు. రిటైరయిన మర్నాటి నుంచీ నిర్ల క్ష్యం చేసిన గడ్డం పెరిగి వుంది. ఆయన ముందు వ్యాస పీఠం, దాని మీద తెరచి పెట్టిన భగవద్గీతా- అందులోంచి ఆయన తన జీవితా నికి అర్థాన్ని వెతుక్కుంటున్నట్లు న్నాడు.

వీళ్ళంతా ఆయన చుట్టూ చేరారు. "ఎందుకిలా చేశారని?" ప్రశ్నల వర్షం కురిపించ సాగారు.

పెద్దవాళ్ళు మాట్లాడు కుంటూంటే

పిల్లలు రవీ రేఖా మెల్లగా ప్రక్కకు జారుకున్నారు. ఆ ప్రక్కన మట్టిలో ఆడుకుంటున్న పిల్లలతో కలిసి పోయారు.

ఇంతలో ఆశ్రమం లోపల్నుంచి శాంతి బాబా బయటికి వచ్చారు. మెల్లగా నడుచుకుంటూ వాళ్ళు కూర్చున్న వయిపు వచ్చారు.

శాంతి బాబా పండిపోయిన వగ్గు. తొంభై ఏళ్ళ వృద్ధులు; వయసులోనే గాక జ్ఞానంలో కూడా పండిన సిద్ధులు!

ఆ ఆశ్రమంలో ఎల్లెడలా వెల్లివిరిసే శాంతి ఆయన వదన బింబం లోంచే వాలు జారుతుండాలి. ఆయన అంత శాంతి స్వరూపులుగా ఉన్నారు!

ఆయన కాషాయ దుస్తుల్లో ఉన్నారు. రాజశేఖరం బాబాగారికి వీళ్ళను పరిచయం చేశాడు.

బాబా వీళ్ళను చిరునవ్వుతో పలకరించారు. కొద్ది సేపట్లోనే వాళ్ళతో చనువుగా కలిసిపోయి తను నవ్వుతూ వాళ్ళను నవ్విస్తోన్నారు.

"ఎందుకయ్యా, ముసలాడ్ని ఈ వయస్సులో ఇంకా వుద్యోగం చెయ్యమనీ, ధనం ఆర్జించమనీ వత్తిడి చేస్తోన్నారంట?" అని బాబా మెల్లగా అసలు విషయం ఎత్తారు.

"చెయ్యకపోతే ఎలా బాబా?" అంటూ కామాక్షమ్మ తన తరపునా కొడుకు తరపునా, కోడలి తరపునా తానే వకాల్తా తీసికొని మాట్లాడింది. సంసారమన్నాక కష్టం సుఖం ఉంటాయనీ, తన సొంత పంథాతో ఏకరవు పెట్టింది. కొడుకూ, కోడలూ కూడా మాట కలిపారు.

వీళ్ళు ఇలా మాట్లాడుకుంటూంటే చిన్న పిల్లలు రవీ, రేఖా ఆటల యావలో వున్నారు. ఆటల్లో వాళ్ళ బట్టల నిండా మట్టీ, బురదా అంటాయి. అదేం పట్టించుకోకుండా వాళ్ళు నవ్వుతూ కేరింతలు కొట్టుతూ ఆడుకుంటున్నారు.

కాత్యాయని వాళ్ళ బట్టల కంటిన మట్టి మరకలు చూచి లబలబలాడిపోయింది. వాళ్ళ వెనకాల పడింది. రవి చేతికందకుండా పారిపోయాడు. చేతికి అందిన చిన్నదాన్ని రెక్క పట్టుకొని లాక్కొచ్చింది.

---

ప్రశ్నా-జవాబు

రోడ్డుపై ఊరేగింపు సాగిపోతున్నది.

మొదటివక్తి: ఏమిటా ఊరేగింపు?

రెండోవ్యక్తి: యూనివర్శిటీ ఫస్టున పాసయ్యాడట ఆయన.

మొదటివ్యక్తి: ఫస్టున పాసయినంత మాత్రాననే ఇంత హంగామా ఎందుకు?

రెండోవ్యక్తి: అసలాయన పరీక్షలే వ్రాయలేదట.... అందుకని.

—కుల్‌సుమ్‌బీ.

ఆ పిల్ల గుక్క పెట్టి ఏడ్పు మొదలు పెట్టింది.

శాంతిబాబా రేఖను దగ్గరికి తీసికొని సముదాయిస్తూ కాత్యాయనితో, "ఎందుకమ్మా! పిల్లను ఊరికే ఏడిపిస్తావు? బట్టలు మురికయితే నేం? వుతికేస్తే మళ్ళీ శుభ్రపడు తాయి! వెళ్ళు చిట్టితల్లీ! అన్న య్యతో ఆడుకో!" అని రేఖను వదిలేశారు.

రేఖ అంతలోనే నవ్వుతూ గునగున నడుచుకుంటూ మిగతా పిల్లలతో కలిసిపోయింది.

బాబా నిండుగా నవ్వుతూ, "చూశావా తల్లీ! నీ కూతురు ఎలా గంతులేస్తూ హాయిగా, నిశ్చింతగా తన చిన్నారి స్నేహితులతో ఆడుకుంటుందో! వాళ్ళను చూడు - వాళ్ళ లోకమే వాళ్ళది. ఈ వయసులోనేకదా వాళ్ళు హాయిగా ఆనందంగా ఆడు కునేది! ఈ వయస్సుకు ఈ ఆట పాటలు సహజం! నీవు ఇప్పుడు వీళ్ళలాగా ఆడగలవా? అలా గంతు లెయ్యగలవా? నీవు కట్టిన ఈ పట్టు చీరకు వాళ్ళలాగా బురదా ఎర్రమట్టి అంటించుకోగలవా? ఎందుకని? నీకు వాళ్ళలాగా అలా ఆడిపాడే వయస్సు దాటిపోయింది గనుక!

"ఇప్పుడు నీవు నిండు చూలాలివి కదా! నీకులాగా మీ అత్తగారు ఈ

---

## మరీ యింత పరధ్యానమా ?

ఒక ప్రొఫెసర్ తన ఆలోచనల్లో బాగా మునిగిపోయి యింటి విష యాల్ని పట్టించుకోవడం మానే శాడు. ఓరోజు అతనిభార్య "మీకు తెల్సాండి...మన బుజ్జి నడవడం ప్రారంభించాడు" అంది.

"ఎప్పటినుండి?" అడిగాడు ప్రొఫెసర్ పరధ్యానంగా.

"వారం రోజులవుతుంది"

"ఓహ్.... అలా అయితే చాల దూరం వెళ్ళి పోయుంటాడు" అన్నాడు ప్రొఫెసర్.

—గుండాన జోగారావు.

---

వయస్సులో పిల్లల్ని కనగలదా? కనలేదు. ఎందుకని? పిల్లలను కనే వయస్సు ఆమెకు దాటిపోయింది! అల్లాగే మీ ఆయనంత యావగా ఆబగా ఈ వయస్సులో మీ మామ గారు డబ్బు సంపాదించగలడా? వయస్సు ప్రొద్దు వాలిపోతున్న ఈ వయస్సులో ఆయనకు కావల్సింది ధనార్జనకాదు తల్లీ! ఆయనకు కావ ల్సింది ముక్తిమార్గం, సర్వతాపత్ర యాల్నుంచీ విముక్తి" అన్నారు.

మధ్యలో ఆగి వాళ్ళ మొహాలవంక పరిశీలనగా చూశారు. తనమాటల్ని ముగ్గురూ శ్రద్ధగా వింటున్నారు. ముగ్గుర్లోకి కామాక్షమ్మ ఎక్కువ

శ్రద్ధగా వింటున్నట్లుంది. బాబా మాటలు సూటిగా ఆమె హృదయానికి తాకుతున్నాయి.

బాబా ఆమె వయిపు తిర్గి ఆమెను వుద్దేశిస్తూ మళ్ళీ ఇలా అన్నారు-

"ఈ చివరి రోజుల్లో మీ ఆయన్ని ఉద్యోగం చెయ్యమనీ, డబ్బు సంపాదించమనీ మీరంతా వత్తిడి చేస్తే ఏమవుతుంది తల్లీ! ఆటలాడుకుంటున్న నీ మనమరాల్ని నీకోడలు లాక్కొస్తే ఆ పిల్ల ఏం చేసింది? గుక్కపెట్టి ఏడ్చింది, గింజుకుంది, గొడవచేసింది. మీ ఆయన పనీ అంతే అయింది. మీ అందరి వత్తిడికీ తట్టుకోనూలేక, ఈవయస్సులో మళ్ళీ సంపాదనాలంపటంలోకి దిగాలేక ఆయన మానసికంగా నలిగిపోయాడు.

"ఆపిల్ల పైకి ఏడ్చింది. ఆయన పైకి ఏడవలేక తనలోతాను కృంగిపోయాడు. మనశ్శాంతికోసం ఇల్లు వదిలేసి ఆశ్రమాల వెంటపడ్డాడు! భగవంతుడు ఈ వయస్సులో ఈ పనిచెయ్యి- ఈ వయస్సులో ఈపని చెయ్యమని నిర్దేశించాడు. కాబట్టి ఏ వయస్సులో చేయవల్సిన పని ఆ వయస్సులో చెయ్యాలి తల్లీ!"

ఈనాల్గు మాటలూ చెప్పి ఇక తన పని అయిపోయినట్లు బాబా అక్కడ్నుంచి లేచి మెల్లగా వెళ్ళిపోయారు.

బాబా చెప్పిన మాటలు మూర్తికీ అతని భార్యకూ అంతగా రుచించినట్టు లేదు.

"చీకటి పడిపోతూంది. ఇహ లేవండి, యింటికి పోదాం!" అని తొందర చేశాడు మూర్తి.

"మీరెళ్ళండి బాబూ! నేనింకా కొన్ని రోజులు ఇక్కడే ఉండాలనుకుంటున్నాను" అని రాజశేఖరం అన్నాడు.

భార్యా భర్తలు మొహామొహాలు చూచుకున్నారు.

"నాన్నగారు రానంటారేమిటి? నీవన్నా చెప్పమ్మా!" తల్లితో అన్నాడు.

కామాక్షమ్మ పమిట చెంగుతో కళ్ళొత్తుకుంటూ, "ఆయన ఇష్టప్రకారమే జరగనీయి మూర్తీ!" అంది. "నేను కూడా మీ నాన్నగారితో పాటే యిక్కడే ఉండిపోతా! రేపు నా బట్టలవీ పంపించు బాబూ!"

మూర్తీ, కాత్యాయనీ ఆమె వంక ఆశ్చర్యంగా చూశారు.

రాజశేఖరం విస్తుబోతూ ఆశ్చర్యంగా అర్ధాంగి వంక చూశాడు. సంధ్యా పూజకు సంకేతకంగా ఆశ్రమం లోపల్నుంచి గంట మ్రోగుతోంది! *